ప్రజాశక్తి

గురువారం 9 మార్చి 2023 5 అనంతపురం





విలేకరులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

మహిళా హక్కుల కోసం పోరాటం



సదస్సులో మాట్లాడుతున్న కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె.శ్రీమతి

- ◆ యువత ఉద్యమాల్లోకి రావాలి
- ◆ మనువాదంతో మహిళలకు సంకెళ్లు
- ◆ కేరళ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి పికె.శ్రీమతి
- ◆ అనంతలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేపర్లకే పరిమితం అవుతున్న మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటాలే మార్గమని, దీనికి కోసం యువత ముందుకు రావాలని కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె.శ్రీమతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని టిటిడి కళ్యాణమంటపంలో ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆశా, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, సిఐటియు, ఎండిఎం ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 'సమానతను సాధించుకుందాం-ఉద్యమాలను బలపరుచుకుందాం' అన్న అంశంపై ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షత సదస్సు కొనసాగింది. ఈ కార్యక్రమానికి పికె.శ్రీమతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతర్జాతీయంగా మహిళల పోరాట ఫలితంగా హక్కులు సాధించుకున్నారని తెలిపారు. 1910వ సంవత్సరంలో కొపెన్‌హాగన్‌లో జరిగిన సదస్సులో మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయం జరిగిందని తెలిపారు. 1975లో ఐక్యరాజ్యసమితి కూడా అధికారికంగా మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. దీన్ని ఒక ఉత్సవంగా కాకుండా పోరాట స్ఫూర్తిగా తీసుకోవాల్సి ఉందన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించబడుతున్నట్టు చెబుతున్నా సోషలిస్టు ప్రభుత్వాలున్న చోట తప్ప తక్కిన ఎక్కడా అమలు జరగలేదన్నారు. అఫ్ఘనిస్తాన్ వంటి పాసిస్టు ప్రభుత్వాలున్న చోట మహిళలపై మరింత వివక్ష, అణచివేత కొనసాగుతోందన్నారు. ఇదే పాసిస్టు భావాలున్న ప్రభుత్వం భారతదేశంలో బిజెపి రూపంలో అధికారంలో ఉందని ఉద్ఘాటించారు. దేశంలో మనుసంస్కృతిని అమలు చేయాలని ఆ ప్రభుత్వం ఇక్కడా చూస్తోందని పేర్కొన్నారు. మనుధర్మవరం ప్రకారం మహిళలకు ఎటువంటి హక్కులూ లభించవని తెలిపారు. ఇప్పటికే దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. ఇందులో ఆ వర్గాల మహిళలు మరింత ఎక్కువగా బాధించబడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇది రాబోయే రోజుల్లో మెజార్టీగానున్న హిందూ మహిళలపైనా జరుగుతుందని హెచ్చరించారు. అందుకే మతతత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ఇక్కడున్న మహిళలు రావడమే కాకుండా యువత కూడా రావాలని పిలుపునిచ్చారు.

మహిళా హక్కుల కోసం పురుషులూ పోరాడాలి : ఎండ్లూరి

మహిళా హక్కుల కోసం మహిళలే కాకుండా పురుషులు కూడా పోరాటం సాగించాలని ప్రముఖ మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళలకు సమస్య వచ్చినప్పుడు మాత్రమే ఐక్యత కాకుండా అన్ని సందర్భాల్లోనూ వారికి అండగా నిలవాలన్నారు. మహిళల హక్కుల రక్షణ ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఆడపిల్ల పుడుతోందంటూ పురిట్లోనే చంపేసే సంస్కృతి ఇటీవల పెరుగుతోందన్నారు. దీన్ని మహిళలే అరికట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. రెడ్స్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి భానుజ మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలున్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. వాటి అమలు కోసమూ పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని చెప్పారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలన్నారు. మహిళా దినోత్సవం స్ఫూర్తితో సమానత సాధనకు ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో మహిళల హక్కుల హరింపు
పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో రాజ్యాంగ ఉల్లంఘనతో పాటు మహిళల హక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మనుధర్మం పేరుతో వారి హక్కులను హరించే సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, యమున, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకుతల, రమాదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, రమణయ్య, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జెవివి నాయకురాలు డా॥ప్రసూన, డా॥ప్రగతి, డా॥విజయపద్మ, యోగా మాస్టర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పికె.శ్రీమతి

ఆడపిల్లల్ని బతకనిద్దాం.. ఎదగనిద్దాం బ్రోచర్‌లు ఆవిష్కరణ

భ్రూణ హత్యలు నివారించి ఆడపిల్లలకు బతుకునిచ్చి.. చదువునిచ్చి.. సమాజంలో అత్యున్నత స్థానాలకు ఎదిగేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు పికె.శ్రీమతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన ఆడపిల్లల్ని బతుకనిద్దాం-చదువనిద్దాం- ఎదుగనిద్దాం అనే బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఆడ, మగ వత్యాసం, వివక్ష లేకుండా మహిళల్ని గౌరవించాలన్నారు.



నాట్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సు సందర్భంగా నాట్య శిక్షకురాలు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో చేపట్టిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇదే సమయంలో యువతులు కర్రసాము ప్రదర్శన ఉత్సహాపూరితంగా నడించాయి.

అధికార దుర్వినియోగం సరికాదు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి
యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తూ మంచి ఆదరణ ఉందంటున్న వైసిపి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడటం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి వైసిపి ప్రభుత్వం అధికార దుర్వినయోగంతో పాటు అనేక రకాలుగా అవకతవకలకు పాల్పడుతోందని విమర్శించారు. బోగస్ ఓటర్లను చేర్పించారని, కోర్టు బోగస్ ఓట్లు తీసివేయాలని చెప్పినా అధికారాన్ని వినియోగించి ఆ ఓట్లన్నీ యథావిధిగా కొనసాగించారని తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలపై బెదిరింపులు, కేసులు, ఒత్తిళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కదరిలో ఒక ఉపాధ్యాయుడు ఇల్లు నిర్మాణం సరిగా ప్లాన్ లేదంటూ ఇల్లు కూల్చేస్తామంటూ బెదిరించారని తెలిపారు. హెచ్ఎం అసోసియేషన్ నాయకుడు పోటీ చేస్తుంటే మద్దతుగా మాట్లాడినందుకు ఓ హెచ్ఎంపై గతంలో సస్పెండ్ కేసును తెరపైకి తెచ్చి బెదిరిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం చేపడుతూ పురోగతి సాధిస్తున్నట్లు ప్రభుత్వం ఊదరగొడుతోంది తప్ప, ఆచరణలో అభద్రతా భావంతో ఎన్నికల్లో దండోపాయం ప్రయోగిస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మార్చి 31వతేదీలోపు రూ.3 వేల కోట్లు చెల్లించనున్నామంటూ సంఘాల నేతలతో చర్చించి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా ఇచ్చే ఆలోచన ఉంటే ఇచ్చేసి మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. గత సంవత్సరం కూడా ఉద్యోగులకు హామీలు ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. జనవరి 15న ఒక డిఎ ఇస్తామని ఇవ్వలేని ప్రభుత్వం రూ.3 వేల కోట్లు నెలరోజుల్లో ఇస్తామంటే నమ్మశక్యంగా లేదన్నారు.ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి హామీలు గుప్పిస్తోందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తోందన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొత్త పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాల్సి ఉందని, వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. రెగ్యులరైజేషన్ చేస్తామని చెప్పడమే తప్పా ఆచరణలో పెట్టలేదన్నారు. ప్రయివేట్ టీచర్లపై ఎన్నికల వేళ ప్రేమ ఒలకబోస్తున్నట్లు ఉందని, ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ఆశ పెడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముందు ప్రయివేట్ ఉపాధ్యాయులకు వేతనాలు ప్రభుత్వం నియమ నిబంధనల మేరకు అందేలా చూడాలని, అకౌంట్‌లో వేతనాలు పడేలా విధానం తీసుకురావాలన్నారు. గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధి ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని కోరారు. అవన్ని నెరవేర్చకుండా కేవలం ఓట్ల కోసం హామీలు గుప్పిస్తే నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు, కార్మికులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ స్వతంత్ర అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, చిత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

197.1 క్వింటాళ్ల చింతపండు విక్రయం

రాయదుర్గం రూరల్ : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన మార్కెట్‌కు 197.1 క్వింటాళ్ల చింతపండు విక్రయాలు జరిగినట్లు కార్యదర్శి సునీత తెలిపారు. కరిపుళి రకం చింతపండు కనిష్ట ధర రూ.9వేలు, గరిష్ట ధర రూ.18వేలు పలికినట్లు తెలిపారు. ఫ్లవర్ రకం రూ.5వేల నుంచి రూ.7,500 దాకా ధర పలికినట్లు తెలిపారు.

నేడు రాయదుర్గంలో ఇస్తిమా

రాయదుర్గం : రాయదుర్గంలో గురు, శుక్రవారాల్లో ఇస్తిమా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న నేషనల్ ఫంక్షన్ హాల్ పక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. బళ్ళారి, హస్పేట్, రాయదుర్గం జిల్లాల ముస్లింలకు ఇస్తిమా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజాముద్దీన్, బెంగళూరు అల్తాఫ్‌బాయ్, బెల్గాం హిదాయత్ బాయ్, తుంకూర్ జుబేర్ బాయ్ హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుండి 10 నుంచి 15వేల వరకూ ముస్లింలు హాజరవుతారని తెలిపారు. ఆయా పనులను నిర్వాహకులు ముతవల్లి బాషా, ఇస్మాయిల్, జాకీర్, దాదు, రహంతుల్లా, ముస్తఫా, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

కాపు రామచంద్రారెడ్డికి కొమ్ముకాస్తున్న పోలీసులు

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాపు రామచంద్రారెడ్డికి రాయదుర్గం పోలీసులు కొమ్ముకాస్తున్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. డి.హీరేహాల్ మండలం చెర్లోపల్లికి చెందిన టిడిపి నాయకుడు మొండి మల్లికార్జునపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సందర్భంగా కాపు రామచంద్రారెడ్డిపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ముఖ్యంగా విప్ కాపు నాయకత్వంలో రాయదుర్గం నియోజకవర్గంలో పోలీసులను అడ్డుపెట్టుకుని టిడిపి నాయకులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపిటిసి మల్లికార్జున మండల పరిషత్ సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం పోలీస్ స్టేషన్ తప్పుడు కేసు పెట్టించారని ఆరోపించారు. వయాగ్రా లాగా పచ్చ మీడియా ఎంతకాలం నెట్టుకొస్తుందని కాపు చేసిన విమర్శను సమాజం ఒప్పుకుంటుందా.. అని ప్రశ్నించారు. కాపును ఎంతకాలం పోలీసులు కాపాడతారన్నారు. స్థానిక సిఐ ఎమ్మెల్యే ఏం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ధ్వజమెత్తారు. గుర్తుతెలియని పత్రికలో కాపు రామచంద్రారెడ్డి చేసిన ప్రకటనపై తాను ఫిర్యాదు చేయడానికి వస్తే పరిశీలిస్తాం.. సమాధానమిస్తాం.. కోర్టుకు వెళ్లండి పోలీసు ఇన్స్‌పెక్టర్ సమాధానం ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ విషయంపై తప్పక పోరాటం చేస్తామని, న్యాయం జరిగే వరకూ వదిలిపెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సిఐతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

నాడు ఫ్యాక్షన్.. నేడు పచ్చని తోటలు

పెద్దారెడ్డి చొరవతోనే ప్రాజెక్టులకు నీరు
ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

నాడు ఫ్యాక్షన్‌తో అట్టుడికిన పల్లెలు.. నేడు పచ్చని తోటలతో అలరారుతున్నాయని, ఇది ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవే కారణమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిక్కేపల్లె గ్రామం నుంచి ప్రారంభమైన ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర నామనాకుపల్లి, షేక్‌పల్లి, ధర్మాపురం వరకూ సాగింది. ఈయాత్రకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి మద్దతు పలికి యాత్రలో పాల్గొన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిక్కేపల్లి సర్పంచి మూల దివ్య, నామనాకుపల్లి సర్పంచి అశ్వినితో కలిసి కేక్‌కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పెద్దపప్పూరు మండలంలోని గ్రామాలు ఫ్యాక్షన్‌తో అట్టుడికేవన్నారు. అయితే జగనన్న సిఎం అయ్యాక ఎమ్మెల్యే పెద్దారెడ్డి చొరవతో నియోజకవర్గంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయన్నారు. దీంతో బోర్లలో నీరు ఇంచి పచ్చని తోటలతో పల్లెలు కళకళలాడుతున్నాయన్నారు. దీనికితోడు సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. కావున మరోసారి జగన్‌తోపాటు పెద్దారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్‌పల్లి, నాగిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి కేక్ కోస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మాజీఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

బస్సులను ఆపి..టిప్పర్లను వదిలి..!

- ◆ వేదవతి హగరి బ్రిడ్జి రాకపోకలపై అధికారుల వింత నిర్ణయం
- ◆ ప్రమాదం పేరుతో బస్సుల నిలిపివేత
- ◆ టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లకు మాత్రం అనుమతులు
- ◆ హెచ్ఎల్సీ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం


కణేకల్లు వద్ద వేదవతి హగిరిపై నిర్మించిన బ్రిడ్జి (హెచ్ఎల్సి అక్విడెట్) పాతదై కూలిపోయే ప్రమాదం ఉన్నందున దీనిపై రాకపోకలు సాగిస్తే ప్రమాదమని ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సుల రాకపోకలను పూర్తిగా ఆపేశారు. బస్సులను అయితే ఆపారు గానీ ఇతర వాహనాలు మాత్రం దీనిపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఓ హెచ్ఎల్సి యువ అధికారి అత్యధిక టన్నులు కలిగిన టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లు, మట్టి ట్రాక్టర్లను నిత్యం బ్రిడ్జిపై రాకపోకలు సాగించేందుకు దొడ్డిదారిన అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. భారీగా బరువున్న వాహనాలు బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నా ఆ హెచ్ఎల్సి అధికారి అటువైపు కన్నెత్తి చూడరు. సదరు అధికారికి చేయి తడిపితే బ్రిడ్జిపై టిప్పర్ల రాకపోకలకు ఇట్టే అనుమతి ఇచ్చేస్తారన్న విమర్శలు బహిరంగంగానే వ్యక్తం అవుతున్నాయి.



వేదవతి హగరి బ్రిడ్జిపై మట్టితో వెళ్తున్న ట్రాక్టర్

ప్రజాశక్తి-కణేకల్లు

కనేకల్లు నుంచి అనంతపురం జిల్లా కేంద్రం, ఉరవకొండ, దర్గాహొన్నూరుతో పాటు మండల పరిధిలోని దాదాపు 20 గ్రామాలకు పైగా బస్సులు రాకపోకలు సాగించేందుకు వేదవతి హగిరిపై నిర్మించిన బ్రిడ్జి ప్రధాన రహదారిగా ఉంది. బ్రిడ్జి పాతది అయ్యిందన్న కారణంతో ఇటీవల దీనిపై రాకపోకలను నిషేధించారు. దీంతో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కణేకల్ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలకు వచ్చే చిన్నారుల నుంచి ఉరవకొండ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఆ దారి మూసేయడంఒ అవస్థలు పడుతున్నారు. వ్యాపారస్తులు, ఉద్యోగులు, గర్భిణులు, బాలింతలు వద్ధులు కణేకల్‌కు ప్రయాణం చేయాలంటే ఓ పెద్ద సమస్యగా మారింది. దాదాపు 8 నెలలుగా ఈ సమస్య ఆ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. బస్సులు రాకపోవడంతో కణేకల్ నుంచి మాల్యం వరకు ఆటో ప్రయాణమే ప్రజలకు దిక్కు అయ్యింది. ఆటో ప్రయాణం కుదరకపోతే కాలినడకన దాదాపు 5 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. ఉరవకొండ నుంచి కణేకల్ వరకు వచ్చే బస్సులు మాల్యం గ్రామం వరకే వస్తున్నాయి. అక్కడి నుంచి కణేకల్‌కు కుదిరితే ఆటో లేకపోతే కాలినడకన ప్రజలు కనేకల్‌కు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



వేదవతి హగరి వంతెన

బ్రిడ్జిపై యథేచ్ఛగా టిప్పర్ల రాకపోకలు

బ్రిడ్జిపై బస్సు వస్తే కూలిపోతుందని కుంటి సాకులు చెబుతున్నా హెచ్ఎల్సీ యువ అధికారి ట్రాక్టర్లు, టిప్పర్లు తిరిగేందుకు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. టిప్పర్లు తిరుగుతున్నాయి కదా... బస్సులు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రజలు ఎవరైనా సదరు అధికారిని ప్రశ్నిస్తే బ్రిడ్జి పై బస్సులు తిరిగితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని అందుకే తిప్పడం లేదని సమాధానం ఇస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్ల వారికి మాత్రం ఆ దారి గుండా రాకపోకలు సాగించేందుకు ఎలాంటి అడ్డంకులూ చెప్పకుండా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల సమయం మొదలైంది. ఈ పరిస్థితుల్లో కనేకల్‌కు బస్సులు రాకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డూఅదుపు లేకుండా ఇసుక తరలింపు

హెచ్ఎల్‌సి పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలి పోతుండడంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. హెచ్ఎల్సీ కింద ఉన్న ఆయకట్ట భూములంతా సాగునీరు లేక బీడుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, బ్రిడ్జిపై నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు, ట్రాక్టర్లను తిప్పితున్న వారిని, అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు వస్తే బస్సులు నడుపుతాం

హెచ్ఎల్‌సి అధికారులు బ్రిడ్జిపై బస్సులు నడపడానికి అనుమతిస్తే రాయదుర్గం నుంచి ఉరవకొండ వయా కనేకల్ మీదుగా బస్సులు నడుపుతాం. ప్రజలు చాలామంది ఫోన్ ద్వారా ఈ విషయాన్ని తమ దృష్టికి తెస్తున్నారు. హెచ్ఎల్‌సి అధికారుల అనుమతి లేకపోవడంతో బస్సులను ఆ బ్రిడ్జి మీదుగా రాకపోకలను ఆపేశాం.

సురేష్, రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్.

వాహనాలు తిరగరాదు

హెచ్ఎల్‌సి బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. దీనిపై ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలు ఏవీ తిరగరాదు. మా శాఖలో సిబ్బంది తక్కువ ఉండడంతో బ్రిడ్జిపై సరైన నిఘా పెట్టలేకపోతున్నాం. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దానికి మేము బాధ్యులం కాదు.

రమణారెడ్డి, హెచ్ఎల్ సి ఈఈ.

చలివేంద్రం ఏర్పాటు

రాయదుర్గం : పట్టణంలోని కనేకల్ రోడ్డు అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం వద్ద బలిజ సంఘం, రాయల యువ సేన ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, ఎర్రిస్వామి, భీమసేన పాల్గొన్నారు

మహిళా సాధికారతకు కృషి

మహిళా దినోత్సవంలో మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మహిళా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా నాయకులతో కలిసి బుధవారం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అక్కాచెల్లెళ్ల ముఖాల్లో ఆనందం చూడటానికే జగనన్న వైఎస్ఆర్ చేయూత పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజకీయ పార్టీలు, మహిళా, ప్రజా, ఉద్యోగ, విద్యార్థి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. మహిళలను ఘనంగా సన్మానించి ప్రశంసలు అందించారు. జిల్లా ఎన్జీవో హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ లలితకుమారి, జిల్లా ట్రైబల్ అధికారి సరలా విజయ కుమారి, జిల్లా నోడల్ అధికారి (ఫామిలీ ప్లానింగ్) సుజాత, అడ్వకేట్ శైలజ, జిల్లా టిబి కంట్రోల్ ఆఫీసర్ అనుపమ జేమ్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కష్టపతి, నర్సింగ్ సూపరిండెంట్ (గ్రేడ్ 1) మంజుల, రాష్ట్ర ఎన్జీవో ఉపాధ్యక్షులు జె.మాధవ, జిల్లా ఎన్జీవో అధ్యక్షులు బి.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.చంద్రమోహన్, రాష్ట్ర ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, జిల్లా ఎన్జీఓ ఉమెన్ వింగ్ చైర్మన్ ఎస్.జమీలా బేగం, జిల్లా సహాధ్యక్షులు బి.వెంకటేష్ బాబు, జిల్లా కోశాధికారి డి.బషీర్ అహ్మద్, జిల్లా ఉపాధ్యక్షులు కుళ్లాయిస్వామి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ శోభ, నగర అధ్యక్షులు ఎం.మనోహర్ రెడ్డితో పాటు 200 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సతీమణి విజయలక్ష్మి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, నగరమహిళా అధ్యక్షురాలు విజయ శ్రీరెడ్డి, కార్పొరేషన్ మాజి డైరెక్టర్ శివ బాల, సరళ, రాధాదేవి, షరీనా, జానకి, శశికళ, శిల్పా, వసుంధర, హసీనా, గౌసియా, సుజాత, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు. అలాగే ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. కళాభారతి అధ్యక్షులు సురేష్‌బాబు, ట్రెజరర్ ఆదినారాయణ, గాయకులు కెటి.శ్రీదేవి, కె.శ్రీదేవి, జి.విజయలక్ష్మి, సుదారాణి, బి.శకుంతలదేవి, అమృతబిందు, రాజేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు. అలాగే ఆల్ ఇండియా బంజరా సేవా సంఘ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబు నాయక్, గౌరవాధ్యక్షులు అశ్వర్థనాయక్, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, సలహాదారులు శేఖర్, క్రిష్ణానాయక్, సుగణబాయి, చంద్రిబాయి, సీరోమణిబాయి, సుశీల బాయి, ప్రసాద్ నాయక్, రామాంజినేయులు నాయక్ తదితరులు హాజరై మహిళలన్ని సన్మానించారు.

రాయదుర్గం : విప్ కాపు రామచంద్రారెడ్డి స్వగృహంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివద్ధి పథాన దూసుకెళ్తున్నారన్నారు. సిఎం జగన్ కూడా వారికి అవకాశాల్లో సగం ఇస్తూ విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలో 50శాతంపైగా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి, నాయకులు వసంతరాజు, దుర్గాదేవి మహిళా సమాఖ్య అధ్యక్షులు పార్వతి, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తాడిపత్రి : సమాజంలో మహిళలు ఏ చిన్న కష్టానికీ అధైర్య పడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని స్వప్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, క్యారీనొ కంపెనీ ఆధ్వర్యంలో పట్టణంలో వెయ్యి మంది విద్యార్థినులు, ఉపాధ్యాయులతో అంబేడ్కర్ సర్కిల్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ దేవరాయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినుల కృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తర్వాత 15 మంది మహిళలు, ఆశావర్కర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జై గౌడసంఘం అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఆయన సతీమణి, విద్యార్థి నాయకులు, క్యారీనొ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక రుద్రంపేటలోని బాలాజీ విద్యాసంస్థలకు చెందిన పీవీకెకె ఇంజినీరింగ్ కళాశాల, బాలాజీ ఫార్మసీ, ఎంబీఏ కళాశాల, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలల్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ట్రెజరర్ పల్లె సింధూర మాట్లాడుతూ మహిళలు స్త్రీతగనలు మారితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ కె.అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీంలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాలిక చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి డా.రెబెకా, ప్రిన్సిపాళ్లు బండి రమేష్‌బాబు, శ్రీధర్, సుబ్బారావు, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి, పివికెకె మహిళా సాధికార విభాగ అధికారిణి దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నగరంలోని బీసీ స్టడీ సర్కిల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏబీసీడబ్ల్యూఓ సుభాషిని, తాడిపత్రి ఎబిసి డబ్ల్యూఓ రంగమ్మ, కళ్యాణదుర్గం ఎబిసి డబ్ల్యూఓ మస్తాన్, బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌నాయుడు, బీసీ హాస్టల్ మహిళా వార్డెన్లు, హాస్టల్ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : త్యాగానికి ప్రతిరూపం మహిళలు అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండ పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 46 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనిమన్నారు. నేటి సమాజంలో పరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ నజీర్, రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, సభ్యులు ప్రభాకర్‌నాయుడు, గణేష్‌బాబు, ఎంపీ నాగభూషణ, నాగేశ్వరరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అలాగే విడపనకల్ మండలవ్యాప్తంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఆర్డీటీ పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారులు పావని, వెంకటేష్‌నాయక్, ఆర్డీటీ ఎస్టీఎల్ వసంత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగరంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు సరస్వతి, సునీత, ఫార్మాసిస్ట్ సరళ, ఇంతియాజ్, భగవాన్‌దాస్, ఆర్‌డిటి సిఒ యశోద, పోలీస్ సిబ్బంది మంజునాథ్, ఆర్డీటీ కమిటీ సభ్యుడు చిన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని శాంతిప్రియ ఆసుపత్రిలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వాహకురాలు డాక్టర్ ఎం.శాంతిప్రియను ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయిబాబు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని తొండపాడు ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్‌గౌడ్, ఆర్డీటీ ఎటిఎల్ నారాయణ, సిఒ నాగమణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు రంగస్వామి, సుకన్య, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి బాలిక.. రేపటి అమ్మ.. లింగ వివక్షత చూపకూడదు.. స్త్రీలను గౌరవించాలి.. తల్లిని మించిన దైవం లేదు..పురిటి బిడ్డను లోకానికి చూపేది అమ్మ ఒక్కటే... అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం ఓ.పి.సిబ్బంది,క్షేత్రస్థాయి సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎపి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాప్తాడు మండలం కాటిగానికాలువ ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాకులు సేవామాతృమూర్తి దేవిరెడ్డిని సత్కరించారు. ఆశ్రమం దేవిరెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించినట్లు రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు, రెడ్డి సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మధు, హనుమంతురెడ్డి, గుగ్గిళ్ల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో సంఘీభావం తెలుపుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం ప్రకారం మహిళలను ఎక్కడ గౌరవిస్తారో.. అక్కడ అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. కావున మహిళలను గౌరవించి మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రమేష్, మహిళలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యూష, మైత్రి, వందన, సాంబ, అబ్దుల్, వంశీ, వెంకటేష్, నికిత, భావన, అనిల్, సుష్మ, శిరీష, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎలైట్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ నాజీర్ హుస్సేన్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎస్ఎన్ కళాశాల లెక్చరర్ పర్వీన్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్నిరంగాల్లో తమదైన పాత్రను పోషిస్తున్నారన్నారు. భూమి నుంచి అంతరిక్షం వరకూ మహిళలు వెళ్లగలుగుతున్నారంటే వారి చైతన్యం ఎంతగా పెరిగిందో అర్థం అవుతుందన్నారు. అలాగే చట్టసభల్లో కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించినప్పుడే దేశం అభివృద్ధి వైపు దూసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనా పర్వీనా, వహీదా,ఉపాధ్యాయ బృందం, మహిళలు పాల్గొన్నారు...

పెద్దవడుగూరు : పెద్దవడూరు మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం హెచ్‌హెచ్ఎఐ ప్రాజెక్టులో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మధుసూదన్‌రావు, పెద్దవడుగూరు, పామిడి మహిళా రైతులు, మధుమూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ఊతకల్లు గ్రామంలో ఉన్న ఫాదర్ ఫెర్రర్ క్యాంప్‌లో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో సమైక్య సంఘం మండల అధ్యక్షురాలు వంద్రమ్మ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహిళలు నేడు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. కావున వారికి ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముక్కన్న, సమైక్య సంఘం మాజీ అధ్యక్షురాలు శంకరమ్మ, మాజీ సర్పంచి రుద్రమ్మ, సచివాలయ హెచ్‌పి నాగమణి, ఎన్జీవో సంఘం మహిళా నాయకులు, ఆర్డీటీ సిబ్బంది జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి


మృతిచెందిన పెద్దింటి వన్నూరుస్వామి

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం-గూబనపల్లి వద్ద బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... డి.హీరేహాల్ మండలం పాత అడిగలి గ్రామానికి చెందిన పెద్దింటి వన్నూరుస్వామి, పెద్దింటి శ్రీనివాసులు విద్యుత్ స్తంబాల ఏర్పాటుకు ఉపయోగించే ట్రాక్టర్‌ను చిత్తూరు నుండి గ్రామానికి తీసుకెళ్తున్నాడు. ఈనేపథ్యంలో కళ్యాణదుర్గం మున్సిపాటీ పరిధిలోని గూబనపల్లి గ్రామ సమీపంలోకి రాగానే అటుగా వెళ్తున్న గేదెలను తప్పించపోయి ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తా పడిపోయింది. ఈ ఘటనలో వన్నూరుస్వామి (29) అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసులు గాయపడ్డాడు. కాగా అటుగా వెళ్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి వెంటనే అంబులెన్స్‌కు తెప్పించి క్షతగాత్రున్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసులను అనంతపురం తలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

బొమ్మనహాల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈనెల 3న శుక్రవారం కర్ణాటకలోని కులగల్లు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి (30) సొంతపని నిమిత్తం బొమ్మనహాల్‌కు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మండల కేంద్రంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అనిల్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందినట్లు బొమ్మనహాల్ హనుమంతునాయక్ తెలిపారు. ఈమేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం తండాకు చెందిన సురేష్‌నాయక్‌పై అదేగ్రామానికి చెందిన ఈశ్వర్‌నాయక్, బాలకృష్ణనాయక్, కిష్టానాయక్, విజయనాయక్, నాగేంద్రనాయక్ మంగళవారం రాత్రి దాడి చేసినట్లు బాధితుని బంధువులు తెలిపారు. సురేష్ నాయక్ ఇంటి వద్దకు వెళ్లి హోలీ పండుగ రంగులు చల్లే విషయంలో వివాదం జరిగిందన్నారు. దీంతో సురేష్‌నాయక్ తలపై కొట్టి గాయపరిచారు. వెంటనే కుటుంబ సభ్యులు బాధితున్ని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. తాడిపత్రి పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న రామచంద్రారెడ్డి పని నిమిత్తం గుత్తి మండలంలోని లచ్చానుపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. కొత్తపేట వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పెద్దవడుగూరు : పదవ తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని గుత్తి ఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్ సూచించారు. బుధవారం పెద్దవడుగూరు బాయ్స్ హాస్టల్లో పదవ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు భయపడకుండా, ఆందోళన చెందకుండా ఉండేందుకు నిపుణులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పెద్దవడుగూరు హాస్టల్ వార్డెన్ సంజీవరాయుడు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రానున్న పరీక్షల్లో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు శివరాంరెడ్డి, ఉమాదేవి, జగన్నాథ్, ఈశ్వరమ్మ, ఆదినారాయణ, జ్ఞానమ్మ, కళాశాల ప్రిన్సిపల్ సురేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

14న డీవార్మింగ్ డే

అనంతపురంసిటీ : ఈనెల 14వ తేదీ డీవార్మింగ్‌డేను పురస్కరించుకుని ఆరోజు మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్స్ ఆదేశాలను పాటించాలన్నారు. ఏదైనా సలహా, సూచనలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బందిని సంప్రదించాలన్నారు.

వర్గీకరణపై మాటతప్పిన బిజెపి

కుందుర్పి : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిన బిజెపి ప్రభుత్వం మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ సాకే గురుమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రామస్వామి ఆలయం వద్ద మాదిగల సంగ్రామ యాత్రను ఎంపిపితోపాటు సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూరురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీ మేరకు వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లు అవుతున్నా పట్టించుకోలేదన్నారు. వెంటనే వర్గీకరణ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాలుక ప్రధాన కార్యదర్శి కృష్ణాపురం బాబు, కుందుర్పి మండల అధ్యక్షుడు వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు మారుతి, మండల ఇన్‌చార్జి పూల వెంకటేశులు, గౌరవాధ్యక్షులు చిలిమప్ప, జూగుల రామాంజనేయులు, బెల్లం చిలిమేస్, కంబదూరు మండల అధ్యక్షులు గంపల రామంజి, ఉపాధ్యక్షులు శంకర్, శివహరి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల కేంద్రంలోని శ్రీవాణీ విద్యానికేతన్ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే వశికేరి గోపీనాథ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాంతారామ్ ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో వశికేరి గోపీనాథ్ ఛారిటబుల్ సేవలు మరువలేనివన్నారు. ఈ శిబిరంలో గుండె, కంటి, ఆపరేషన్లు, మోకాలు, భుజం, మెడకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి దాదాపు 1000 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా వీరిలో కళ్లు, గుండెకి సంబంధించి. 150 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలితమ్మ, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, వైసిపి పట్టణ కన్వీనర్ సి.ఓబులేసు, ఎంపిపి చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, ఉరవకొండ ఉప సర్పంచి వన్నప్ప, కురుబ సంఘం నాయకులు వసకేరి లింగమూర్తి, శివప్రసాద్, వాణీ విద్యానికేతన్ కరస్పాండెంట్ రఘురాములు, శ్రీలక్ష్మి ట్రస్టు ట్రెజరర్ మహేష్, టౌన్‌బ్యాంకు అధ్యక్షులు సాదు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.


వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-గుంతకల్లు

పశ్చిమ రాయల సీమ శాసన మండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని 10 గ్రామాల్లో సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సాకే నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ప్రజా గొంతుకలుగా చట్ట సభల్లో ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ షబ్బీర్‌బాషా, మల్లి, సురేంద్ర, ఎస్ఎఫ్ఐ వెంకీ, కిషోర్, అనిల్, చందు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పశ్చిమ రాయలసీమ నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఎం, రైతుసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని ఎ.కొండాపురం, అరకటివేముల, సూరేపల్లి గ్రామాల్లో ఓటర్లను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే మండలిలో ప్రజల గొంతుకను వినిపిస్తారన్నారు. ముఖ్యంగా ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సూరి, మండల అధ్యక్షుడు రామంజి, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ సంఘం మండల అధ్యక్షుడు వెంకటచౌదరి, డి.పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లుతో ఓటర్లను అభ్యర్థిస్తున్న సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నారాయణ కళాశాల వార్షికోత్సవం

అనంతపురం : అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల గర్ల్స్ కళాశాల డేస్కాలర్ బ్రాంచ్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ హిమబిందు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నారాయణ కళాశాల బద్రీనాథ్, బిజిఎం వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు వై.ప్రణయ్ రెడ్డిని యూత్ విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా ఎన్నిక కావడం పట్ల విడపనకల్, ఉరవకొండ మండల కేంద్రాల్లో బుధవారం వైసిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైసిపి మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, ఎంపిటిసి ఓబులేష్, సర్పంచులు సుశీల ఉమాశంకర్, దేవేంద్ర, నాయకులు హంపయ్య, ఉమాశంకర్, మాధవరెడ్డి, గాజుల చిన్న వెంకటేష్, వరదారెడ్డి, గాజుల పెద్ద వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోసి చిన్నారులకు తినిపిస్తున్న దృశ్యం